క్లుప్తంగా

24 గంటల పాటు వైద్యసేవలు నిలిపివేత

చీరాల: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా దేశంలోని అన్ని హాస్పిటల్స్ 24 గంటలు పాటు వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుందని ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎ.భవానిప్రసాద్, చీరాల బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.శ్రీదేవి, డాక్టర్ పి.శ్రీకాంత్‌లు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు సాధారణ వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఎమర్జెన్సీ కేసులు మాత్రమే చూడనున్నట్లు తెలిపారు. ఒక మహిళా డాక్టర్‌పై జరిగిన అన్యాయానికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలానే శనివారం ఉదయం 8.30 నిమిషాలకు చీరాల ఏరియా వైద్యశాల వద్ద నిరసన, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా గమనించి సహకరించాలన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి



చీరాల రూరల్: బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలు మరువలేనివని స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి కార్యక్రమాన్ని చీరాల గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని గడియార స్తంభం సెంటర్లోని గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైకుంఠపురంలోని గౌడ కళ్యాణ మండపం, ఈపురుపాలెంలోని గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన లచ్చన్న విగ్రహాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది నాశన రామకోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ సూరగాని లక్ష్మి, బాల నరసింహారావు, బీసీ సంఘాల నాయకులు న్యాయవాది మస్తాన్‌రావు, సంఘ గౌరవాధ్యక్షుడు యనుమల యానాదిరావు, తాతారావు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకి కోసం ప్రయత్నం

మార్టూరు: గుర్తుతెలియని మృతదేహానికి సంబంధించిన వివరాల కోసం మార్టూరు పోలీసులు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సీఐ మద్దినేని శేషగిరిరావు వివరాల మేరకు.. ఈనెల 14వ తేదీ సాయంత్రం మండలంలోని నాగరాజుపల్లి గ్రామం ఎర్ర చెరువులో తేలియాడుతున్న సుమారు 40 ఏళ్ల వయసు గల పురుషుని మృతదేహాన్ని గుర్తించిన సంగతి తెలిసిందే. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్న మృతదేహం సుమారు నాలుగు రోజులపాటు నీటిలో ఉబ్బిపోయి ఆ వ్యక్తి తాలూకు ఎలాంటి ఆనవాళ్లను అధికారులు గుర్తించలేకపోయారు. మృతుడు బూడిద రంగు నెక్ టీషర్టుతో పాటు మెరూన్ కలర్ డ్రాయర్ ధరించి ఉన్నాడని, చెరువు ఒడ్డున ఎరుపు గడులు కలిగిన ఆకుపచ్చ టవలు, అశోక కంపెనీ చెప్పులు ఉన్నాయన్నారు. మృతుడి ఎత్తు సుమారు 5.6 అడుగులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. గ్రానైట్ కార్మికుడు కావచ్చని భావిస్తున్న మృతుడి ఆచూకీ వివరాలు తెలిసినవారు 91211 02151 నంబర్కు ఫోన్ చేసి తెలపాలని సీఐ కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి విచారణ

మార్టూరు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు ఉద్యోగిపై ప్రభుత్వ వైద్యుడు దాడి చేసిన విషయమై శుక్రవారం జిల్లా అధికారి ఆసుపత్రిలో విచారణ నిర్వహించారు. 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు ఉద్యోగి పఠాన్ రహీంఖాన్‌పై అదే ఆసుపత్రిలో డెంటల్ వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న ఎస్. భానుచందర్ నాయుడు గత నెల 26న విషయమై సాక్షిలో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి శేషుబాబు శుక్రవారం ఆసుపత్రికి వచ్చి బాధితుడు రహీంఖాన్‌లను, వైద్యుడు భానుచందర్ నాయుడుల నుంచి రాతపూర్వకంగా విచారణ తీసుకొని వెళ్లినట్లు సమాచారం. గత 15 రోజులుగా జిల్లా వైద్యాధికారి శేషుబాబును మీడియా ప్రతినిధులు వివరణ కోరుతున్నప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా విచారణ జరిపి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది.



ఉత్తమ ఏపీఎంగా అవార్డు తీసుకుంటున్న చీరాల ఏపీఎం సుబ్బారావు



యద్దనపూడి: పురస్కారం అందుకుంటున్న వైద్యాధికారి శ్రీహర్ష



ఆర్టీసీ నెల్లూరు ఈడీ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న కండక్టర్ శ్రీనివాసరావు



మార్టూరు: ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్



మేదరమెట్ల: అవార్డు అందుకుంటున్న విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు

ఉత్తమ సేవలకు ప్రశంసలు

చీరాల రూరల్/చీరాల టౌన్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన అధికారులు ప్రశంసలు అందుకున్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం బాపట్లలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళీ, జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య తదితరులు అవార్డులు, ప్రశంసపత్రాలు అందించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో డివిజన్‌లో విశేష సేవలందించిన ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి ప్రశంస పత్రం అందుకున్నారు. చీరాల వెలుగు ఏపీఎం జి.సుబ్బారావు మరోసారి ప్రశంసలు అందుకున్నారు. ఉత్తమ ఏపీఎంగా 15 సార్లు అవార్డు తీసుకోవడం చీరాలకు మరో అదృష్టమని వెలుగు పథకం ఉద్యోగులు, వీఏవోలు, పొదుపు సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తమ ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్‌గా అవార్డుతో పాటు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తమ అధికారి అవార్డు అందుకున్న పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపారు.

■ ఉత్తమ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వహకుడిగా షాడోస్ స్వచ్ఛంద సంస్థ నిర్వహకుడు ఆల్ఫ్రెడ్ రాజా సాల్మన్ ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. చైల్డ్ లేబర్‌ను పనులలో పెట్టుకుని వెట్టిచాకిరీ చేయించరాదని కార్మికశాఖతో కలసి అవగాహన కార్యక్రమాలు చురుకుగా ఏర్పాటు చేసినందుకుగాను ఈ అవార్డు ప్రదానం చేసినట్లు చెప్పారు.

■ చీరాల ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కండక్టర్ పిర్ల శ్రీనివాసరావు ఉత్తమ కండక్టర్‌గా జోనల్ స్థాయిలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీ నెల్లూరు జోనల్ కార్యాలయంలో ఈడి ఆదాం సాహెబ్ చేతుల మీదగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఆయనను డిపో మేనేజర్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

■ చీరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పవని భాను చంద్రమూర్తి ఉత్తమ సేవా పతకాన్ని అందుకున్నారు. ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం బి.సాల్మన్‌రాజు ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

యద్దనపూడి: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పి. శ్రీహర్ష జిల్లా వైద్యశాఖాధికారి ఎస్. విజయమ్మ చేతులమీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సుభాషిణికి పీడీ రాజేష్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందజేశారు. కారంచేడు 108 వాహనంలో పనిచేస్తున్న ఈఎంటీ కమలాకర్ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు.

మార్టూరు: స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె రమేష్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. జిల్లా కేంద్రం బాపట్లలో జిల్లా ఫారెస్ట్ అధికారి ఎల్ భీమయ్య చేతుల మీదుగా బాపట్ల డివిజన్ చేరాల రేంజ్ కూకట్ పల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె రమేష్ ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు.

ప్రతిభా పురస్కారం అందుకున్న ఏఈ శ్రీనివాసరావు..

మేదరమెట్ల: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రతిభా పురస్కారం అవార్డులను అమరావతిలో అందజేశారు. అందులో భాగంగా కొరిశపాడు మండల విద్యుత్ ఏఈ మైలా శ్రీనివాసరావుకు పురస్కారం దక్కినట్లు ఆయన తెలిపారు. పురస్కారం అందుకున్న ఏఈని సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఉత్తమ ఏపీఎంగా ప్రసాద్‌బాబుకు అవార్డు

జే.పంగులూరు: మండలంలో ఏపీఎంగా పనిచేస్తున్న జ్యోతి ప్రసాద్‌బాబుకు, సీసీ శ్రీనివాసరావు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ వై పిచ్చిరెడ్డి, ఏరియా కో ఆర్డినేటర్ రవికుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

ఉత్తమ పురస్కారాలు అందుకున్న అద్దంకి సీఐ, కమిషనర్..

అద్దంకి రూరల్: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో అద్దంకి సీఐ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, ఏఈ మరియదాసు, ఆర్ఐ శంకరరావు, ఈవోఆర్డీ హనుమంతరావు, అద్దంకి సీహెచ్‌సీ వైద్యుడు శరత్ కుమార్‌లు ఆయా శాఖల అధికారుల చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్నారు.



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు భానుచంద్రమూర్తి



ఉత్తమ ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్‌గా అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి



అవార్డు అందుకుంటున్న అద్దంకి మున్సిపల్ కమిషనర్



ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న ఆల్ఫ్రెడ్ రాజా సాల్మన్



జె.పంగులూరు: పీడీ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న ఏపీఎం జ్యోతిప్రసాద్‌బాబు



కారంచేడు: మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఈఎంటీ కమలాకర్

వరాలిచ్చే కల్పవల్లీ మమ్మేలవమ్మా !



చీరాల: భక్తుల నివాసంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కొత్తపాలెం ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పూనూరులో ప్రత్యేక అలంకరణలో నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు

- వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు
- మహిళలతో కిటకిటలాడిన ఆలయాలు

కారంచేడు/యద్దనపూడి: శ్రావణ మాసంలో వరలక్ష్మీదేవికి వ్రతాలు ఆచరిస్తే అష్టైశ్వర్యాలతో పాటు సౌభాగ్యం, మాంగళ్య బలం చేకూరుతుందని మహిళల విశ్వాసం. దీంతో శ్రావణ శుక్రవారాన్ని ఆచరిస్తూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లను, స్వామివార్లను పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం కారంచేడు పెద బజారుశివాలయం, మాధవస్వామి దేవాలయం, వెంకటేశ్వరస్వామి గుడి, సాయి మందిరం, వైష్ణవి దుర్గాలయం, మండలంలోని స్వర్ణ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.యద్దనపూడి మండలం పూనూరులోని నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు.

చీరాల అర్బన్: శ్రావణ మాసం రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాలను పట్టణ, గ్రామాల్లోని దేవాలయాలు, నివాస గృహాల్లో ఘనంగా నిర్వహించారు. వరాలిచ్చే వరలక్ష్మీ మమ్ములను చల్లగా దీవించంటూ భక్తులు అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. భక్తుల నివాసాల్లో అమ్మవారిని ప్రతిష్టించి విశేష అలంకరణలు చేశారు. అమరావారి వీధిలోని శ్రీలక్ష్మీ భజన సమాజం దేవాలయం, కస్తూరిబా బాలికోన్నత పాఠశాల సమీపంలో కనక మహాలక్ష్మీ అమ్మవారి మందిరంలో విశేష పూజలు నిర్వహించారు.

వాడవాడలా వరలక్ష్మి వ్రతాలు..

బల్లికురవ: మండలంలోని కొత్తపాలెం, కొదండ రామాలయం, కొండాయపాలెం, కోదండ రామాలయం, శివాలయం, కొణిదెన శివాలయంతో పాటు మండలంలోని ప్రతి గృహంలోనూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లోని అమ్మవార్లను పూజారులు అలంకరించి అమ్మవారికి కుంకుమ పూజ పంచామృతాభిషేకాలు చేశారు.

అద్దంకి రూరల్: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వత్రాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అద్దంకి పట్టణంలోని ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బల్లికురవ (అద్దంకి రూరల్): టీటీడీ, హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని వైదన గ్రామంలోని కోదండరామాలయంలో సామూహిక వ్రతాలు ఘనంగా నిర్వహించారు. పూజల్లో 100 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న వారికి టీటీడీ పూజాద్రవ్యాలను, అమ్మవారు రూపులను రక్షా కంకణములు ఉచితంగా అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, పాల్గొని శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతం గురించి భక్తులకు వివరించారు. ప్రాజెక్టు సభ్యులు పీ. వెంకట్రావు, మాదాల దానయ్య, పుట్టా వీరాంజనేయులు, స్థానిక దేవాలయం ట్రస్ట్ చైర్మన్ రామిశెట్టి శివయ్య, వైస్ ప్రెసిడెంట్ కూలి బాలకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భజనా మండలి సభ్యులు బొమ్మిశెట్టి త్రివిక్రమరావు, బొమ్మిశెట్టి సాంబశివరావు, శివయ్య, పాల్గొన్నారు.



అద్దంకిలోని దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారు



బల్లికురవ: సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న భక్తులు



స్వర్ణలో వరలక్ష్మీదేవి వ్రతం ఆచరిస్తున్న మహిళా భక్తులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వేటపాలెం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద నుంచి కూరగాయల మార్కెట్ వరకు రోడ్లపై ట్రాఫిక్ అంతరాయంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి ఎస్సై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా పలువురు పండ్ల, పూల వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా అక్రమించి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. వీరందరు రోడ్లపై నుంచి తమ వ్యాపారాలు తీసివేసి రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎం వెంకటేశ్వర్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్యవేదిక ప్రజాశక్తి నాయకులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్ బాబు, శ్రీమన్నరాయణమూర్తి పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన మంత్రి

బల్లికురవ: మండలంలోని కొప్పరపాడు సబ్ స్టేషన్‌లో నూతనంగా శుక్రవారం రూ.1.20 కోట్లతో నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. శుక్రవారం సబ్ స్టేషన్‌లో అదనపు నిధులతో బిగించిన రూ.1.20 కోట్ల విలువైన ట్రాన్స్‌ఫార్మర్లను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఒంగోలు సూపరింటెండెంట్ సత్యనారాయణ, అద్దంకి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నల్లూరి మస్తానర్‌రావు, ఏడీఈ ముప్పా సురేంద్ర బాబు, జూనియర్ ఇంజినీర్ వేదవ్యాస ఉన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

ఫౌండేషన్ సహకారం అభినందనీయం

కారంచేడు: గత 17 ఏళ్లగా దగ్గుబాడు, జరుబుల వారిపాలెం, కొడవలివారిపాలెం సమీప గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన రాత పుస్తకాల పంపిణీకి హైదరాబాద్‌కు చెందిన పొన్నం శివకుమార్ ఫౌండేషన్ సహకారంతో రాతపుస్తకాలు అందించడం అభినందనీయమని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని జరుబులవారిపాలెం ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పొన్నం వెంకట్రావు, హెచ్‌ఎం సీహెచ్ ఝాన్సీరాణి, సీహెచ్ నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ కొణిదెల శారద, ట్రస్ట్ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాతపుస్తకాలు అందించిన నిర్వాహకులు, ఉపాధ్యాయులు

అడిగే వారెవరు.. చెప్పేవారెవరు

- రహదారులను ఆక్రమిస్తున్న ప్రైవేటు వాహనాలు
- రోడ్లపైనే వాహనాల మరమ్మతులు
- ట్రాఫిక్‌కు అంతరాయం

చీరాల టౌన్: పట్టణంలోని పలు ప్రధాన రహదారులు ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారాయి. రహదారులపైనే వాహనాలను నిలిపి వాటికి మరమ్మతులు చేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులకు ఇరువైపులా ప్రవేటు వాహనాలు నిలుపుదల చేయడం, వాహనాలకు మరమ్మతులు చేయడంతో అటు వాహనదారులు ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రధాన రహదారులైన గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం రోడ్డు, చర్చిరోడ్డు, హైస్కూల్ రోడ్డు, ఆర్వోబీ పరిసర ప్రాంతాల్లోని రహదారులు ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ కేంద్రాలుగా నిలిచిపోయాయి. ఈ రోడ్లపై గల్ఫర్ మిషన్లు, ప్రైవేటు అంబులెన్సులు, ఇతర రవాణా వాహనాలు, ఆటోలు, కార్లు నిలుపుదల చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు..

వాహనాల రాకపోకలకు వీలుగా ఉండేందుకు మున్సిపల్ ఆఫీసు రోడ్డు, చర్చిరోడ్డు, విఠల్ నగర్‌రోడ్డులో సిమెంటు రోడ్డు వేసి విస్తరించారు. కాని కొంతమంది ఆరోడ్లపైనే వాహనాలను నిలిపి వాటి మరమ్మతులు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. రాత్రి వేళలలో అయితే వాహనాలు రోడ్లపైనే నిలిపి ఉంచడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చర్చిరోడ్డులో రోడ్డు పక్కన మినీ బస్సులు, ట్రాక్టర్లు వంటివి నిలుపుతున్నారు. అలానే రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న విఠల్‌నగర్ రోడ్డు ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది. ఓవర్ బ్రిడ్జి కింది భాగంలో గ్యారేజిలు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు వాహనాలు మరమ్మతులు చేసుకుంటూ రోడ్డును సగభాగం ఆక్రమించారు. ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు ప్రవేటు వాహనాల పార్కింగ్ రోడ్డుగా మారింది. ఈ రోడ్డులో ప్రభుత్వ వైద్యశాలతో పాటుగా పలు ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. కొత్తపేటకు వెళ్లే ప్రధాన రహదారి ఇలా ఉంటే మిగిలిన రోడ్ల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అలానే విఠల్‌నగర్, వైకుంఠపురం, హరిప్రసాద్‌నగర్, స్వర్ణ వైపు వెళ్లే ఆటోలు, పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది ప్రజలు ఆర్వోబీ ఎక్కకుండా వెళ్లడానికి వినియోగించే రోడ్డులో వాహనాల నిలుపుదల చేయడం ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొని ఉంది.



ఆసుపత్రి రోడ్డుపై నిలిపిన ప్రైవేటు వాహనాలు

రోడ్డుపై రిపేరు చేయకుండా చర్యలు తీసుకోండి..

రోడ్డు పక్కన వాహనాలు నిలుపుదల చేయడం, మరో వైపు ఆ వాహనాకు మరమ్మతులు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రైవేటు వాహనాల పార్కింగ్‌గా మారిన ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, కొత్తపేటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలపుదల చేయకుండా అధికారులు కృషిచేయాలి.

-కే నరేష్, స్థానికుడు

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది..

ఎంతో వ్యయంతో నిర్మించిన రోడ్డుపై ఇలా వాహనాలు మరమ్మతులు చేయడం వలన నడిచేవారికి, వాహనదారులకు ఎంతో ఇబ్బంది కలుగుతోంది. రోడ్డు సగానికి వాహనాలు నిలపడం వలన రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి.

- ఎం. శ్రీనివాస్, స్థానికుడు